



రైతు మహోత్సవ వేదికపై చిరునవ్వులు చిందిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు

గోశాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కొమురవెల్లి మల్లన్న ఆలయ ఈవో అన్నపూర్ణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న భక్తుల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, వన మహోత్సవం గోశాల నిర్మాణం చేపట్టాడానికిశుక్రవారం ఈవో అన్నపూర్ణ స్థల పరిశీలన చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కోడెలు పదిలమేనా శీర్షిక ప్రత్యేక కథనానికి ఆలయాధికారులు స్పందించారు. కొమురవెల్లి మల్లన్నకు భక్తులు మొక్కుబడులుగా అందిస్తున్న కోడెలు, గోవుల సంరక్షణ నిమిత్తం శాశ్వత ప్రాతిపథకన గోశాల నిర్మాణం చేపట్టేందుకు ఆలయాధికారులు నిర్ణయించి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి తోటబావి ప్రాంగణంలో తాత్కాళికంగా గోశాల కొనసాగిస్తున్న క్రమంలో శాశ్వత ప్రాతిపదికన అన్ని వసతులతో నూతన గోశాల నిర్మాణానికి సంకల్పించారు. తాత్కాళికంగా కొనసాగిస్తున్న ప్రదేశంలో అందుబాటులో ఉన్న స్థలంతో పాటు రాజీవ్ రహదారి చేరువన ఉన్న ఆలయ స్థలాన్ని ఆలయ ఈవో అన్నపూర్ణ తదితరులు పరిశీలించారు. అలాగే ఇదే ప్రాంతంలో వసతి గదుల సత్రం నిర్మాణానికి అనుగుణంగా సులభ్ కాంప్లెక్స్ కూడా కట్టేందుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలన జరిపారు. గతంలో స్వామివారికి నిత్య పూజా కైంకర్యాలకు వినియోగించే పూలు బిల్వ పత్రాలు, ఉత్సవాలు అవసరపడే అరటి కొబ్బరి మామిడి ఇతరత్రా చెట్లు నాటాలని నిర్ణయించారు. ఆయా పనుల కార్యాచరణ కోసం ప్రత్యేక చొరవ తీసుకోనున్నట్లు ఈవో అన్నపూర్ణ తెలిపారు.

హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు మహోత్సవాన్ని శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కిసాన్ మేళాకు నియోజకవర్గంతో పాటు ఇతర జిల్లాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు అన్నదాతలతో కళకళలాడాయి.



రైతు మహోత్సవానికి ఎడ్లబండిపై వస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్



యంత్రాన్ని పరిశీలిస్తున్న మహిళా రైతు

కిసాన్ మేళా.. కళకళ

ప్రారంభమైన రైతు మహోత్సవం
హాజరైన మంత్రులు తుమ్మల, పొన్నం
అధునాతన యంత్రాలు, వ్యవసాయ స్టాళ్ల ఏర్పాటు



కిసాన్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

హుస్నాబాద్/హుస్నాబాద్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న రైతు మహోత్సవం ప్రారంభం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వీరు ఎడ్లబండిపై ఎక్కి ఊరేగింపుగా మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా వద్దకు వచ్చారు. మంత్రులతో పాటు హాజరైన కలెక్టర్ మనుచౌదరి, వ్యవసాయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జానయ్య, ఉద్యానవన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ రాజిరెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో పాటు శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అధునాతన విధానాలపై అవగాహన కల్పించారు.

150 స్టాళ్ల ఏర్పాటు

వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్య శాఖ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ఎఫ్‌పీవోలు, స్టార్టప్ కంపెనీలు, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రైవేట్ కంపెనీలకు చెందిన దాదాపు 150 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రైతులు ప్రతీ స్టాల్‌ను సందర్శించి, కొత్త వాటిపై ఆసక్తి కనబర్చారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల్ నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రర్వాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మేళాకు మంత్రులు ఎడ్లబండిపై రాగా, వారు స్టాళ్లను పరిశీలిస్తున్న క్రమంలో బండికున్న ఎద్దు బెదిరి పరుగులు తీసింది. దీనిని కట్టడి క్రమంలో ఓ యువకుడికి స్వల్ప గాయమైంది.

హుస్నాబాద్ సస్యశ్యామలం అవుతుంది

● వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

త్వరలోనే హుస్నాబాద్ ప్రాంతం పచ్చని పంటలతో సస్యశ్యామలం అవుతుందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. నంగునూర్‌లో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని వచ్చే నెలలో ప్రారంభిస్తామన్నారు. హుస్నాబాద్‌లో స్థలం కేటియించినట్లయితే ఆయిల్‌పామ్ గిడ్డంగి, రీఫైండ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పక్క రాష్ట్రాలకు కూరగాయలు ఎగుమతి చేసేలా ఎదగాలన్నారు. ఆయిల్‌పామ్ కోతకు వచ్చే వరకు అంతరపంటగా మునగ సాగు చేస్తే లాభాలు గడించవచ్చన్నారు.

రాష్ట్రానికి మోడల్‌గా నిలవాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్

మూడు రోజుల పాటు జరుగుతున్న రైతు మహోత్సవంలో తెలుసుకున్న అనుభవాలను వ్యవసాయంలో జోడించి పంటల దిగుబడిలో రాష్ట్రానికే మోడల్‌గా నిలువాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గౌరవెల్లి రిజర్వాయర్ త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయం చేయాలని సూచించారు.

ఎవుసంలో మేము వాడని ఎన్నింటినో చూసినం

\- వేల్పుల సరోజన, రైతు



నాకు మూడు ఎకరాల వరకు భూమి ఉన్నది. నేను 25 సంవత్సరాల నుంచి ఎవుసం చేత్తన్నా. ఇప్పటి దాకా ఎవుసంలో సూడని ఎన్నో కొత్తకొత్త వస్తువులను చూసినం. ఇది రైతులకు మంచిగ ఉపయోగపడ్డది. చాలా బాగా అనిపించింది.

మాకు తెలువని కొత్త కొత్తవి ఇక్కడ పెట్టారు

\-దొమ్మాట తిరుపతిరెడ్డి, ధర్మసాగర్‌పల్లి, కోహెడ మండలం



ఈ కిసాన్‌మేళాలో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు సంబంధించిన వన్ని ఒక్క చోటనే ఏర్పాటు చేయడం బాగుంది. ఇలా చూడటం ఇది మొదటిసారి. మాకు తెలువని కొత్త కొత్త యంత్రాలు, పనిముట్లు ఇక్కడ పెట్టారు. రొటవేటర్ తీసుకుందామని వచ్చాం. కొంచెం ధర ఎక్కువ ఉందని అనిపించింది.

మహంకాళీ అమ్మ దీవెనతో త్వరలో ఇర్కోడ్ లిఫ్ట్ ప్రారంభం

మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/సిద్దిపేట అర్బన్/నంగునూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మహంకాళీ అమ్మవారి దీవెనలతో త్వరలోనే ఇర్కోడ్ లిఫ్ట్ ప్రారంభం కానుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేట నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ఇర్కోడు గ్రామంలో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఈ ప్రాంతంలోని పంటలకు పుష్కలమైన నీళ్లు రాబోతున్నాయన్నారు. ఇర్కోడు ప్రజలకు, రెడ్డి సంఘం సభ్యులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఆశీస్సులతో రూ.50 లక్షలు మంజూరు చేసుకొని ఆలయాన్ని అభివృద్ధి చేసుకున్నామని గుర్తుచేశారు. చింతమడక పట్టాభి రామాచంద్ర స్వామి ఆలయం ధ్వజం స్థంభం ఏర్పాటుకు అవసరమగు ఆర్థిక సహాయాన్ని హరీశ్‌రావు విరాళంగా అందించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మత్స్యకారులకు ఆర్థిక భరోసానిచ్చామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రూ.5 కోట్లతో సిద్దిపేటలో రాష్ట్రంలోనే ఆదర్శంగా ముదిరాజ్ సంఘం భవనాన్ని నిర్మించామని తెలిపారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో అన్నింటా శుభం జరగాలని ఆకాంక్షించారు. రామంచ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మాదయ్య, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్‌వర్మ, మాజీ సర్పంచ్ సత్యానారాయణగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇర్కోడు మహంకాళీ ఆలయంలో పూజలు చేస్తున్న హరీశ్‌రావు

విద్యా శాఖ మంత్రిని నియమించాలి

దుబ్బాక, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వెంటనే విద్యా శాఖ మంత్రిని నియమించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బడిబాట మొదలై పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నా, బడుల బాగోగులు చూసేందుకు ఇప్పటివరకు ఈ ప్రభుత్వం విద్యా శాఖ మంత్రిని నియమించలేదని మండిపడ్డారు. గురుకులాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయని, సుమారు 60 మంది విద్యార్థులు గురుకులాల్లో మృతిచెందారని గుర్తుచేశారు. మధ్యాహ్న భోజనం సరిగ్గా లేక వేలాది మంది విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారని హరీశ్‌రావు మండిపడ్డారు. విద్యా శాఖతో పాటు ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖలకు మంత్రులు లేరని, అదే డబ్బులు వసూలు చేసే మంత్రులు మాత్రం ఉన్నారని ఎద్దేవా చేశారు. ముక్కుపిండి ప్రజల మీద పడి వసూళ్లు చేయడానికి ఎగబడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. గతంలో ఎల్ఆర్ఎస్ ఫ్రీ అని చెప్పి, ప్రస్తుతం అడ్డగోలుగా ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పద్మశాలి సంఘ భవనానికి కృషి చేస్తా

పద్మశాలి సమాజ అభివృద్ధి కోసం సంఘం కలిసికట్టుగా కృషి చేయాలని హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పద్మశాలి సమాజం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పద్మశాలి ఎన్నికలు

మిగతా 8వ పేజీలో

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కావలెను

సిద్దిపేట మున్సిపల్‌లో కొన్నేళ్లుగా భర్తీ చేయని రెగ్యులర్ పోస్ట్

డిప్యూటేషన్‌పై వచ్చిన వారు తిరిగి సొంత శాఖలకు ● ఐదు నెలలుగా ఖాళీగానే..



సిద్దిపేట అంధ్రజ్యోతి, జూన్ 6 : ఉదయం లేచింది మొదలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు కలిసికట్టుగా శ్రమించి జిల్లా కేంద్రాన్ని స్వచ్ఛ సిద్దిపేటగా తీర్చిదిద్దారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ పలు అవార్డులను సైతం సిద్దిపేట మున్సిపల్ దక్కించుకోవడంలో వారి కృషి మరువలేనిది. అలాంటిది కొన్ని నెలలుగా మున్సిపల్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు గ్రహణం పట్టుకుంది. ఐదు నెలలుగా ఒక్కరు లేకపోవడంతో పట్టణ స్వచ్ఛతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

సిద్దిపేట మున్సిపల్‌కు లేని రెగ్యులర్ పోస్ట్

స్వచ్ఛతలో ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట మున్సిపల్‌కు కొన్నేళ్ల నుంచి ఇప్పటి వరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రెగ్యులర్ పోస్టును భర్తీ చేయకపోవడం విడ్డూరం. సిద్దిపేట ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో సాధారణ మున్సిపల్ నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపల్‌గా సిద్దిపేట అవతరించింది. అందుకు తగినట్టుగానే వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు డిప్యూటేషన్‌పై సిద్దిపేట మున్సిపల్‌కు వచ్చారు. దీంతో 2018 నుంచి 2022 వరకు ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండగా, 2023-2024 వరకు ఆ సంఖ్య నలుగురికి చేరింది. వారి పర్యవేక్షణలో పట్టణాన్ని పలు విభాగాలుగా చేసి వారి ఆధ్వర్యంలో

మిగతా 8వ పేజీలో

ప్రశ్న అనేక మెదళ్లకు కదిలిక

● పౌర సమాజ సైనికుడు జర్నలిస్టు

● కేంద్ర సమాచార మాజీ కమిషనర్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

జగదేవ్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రశ్న అనేక మెదళ్లను కదిలిస్తుందని కేంద్ర సమాచార మాజీ కమిషనర్, నల్సార్ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. గజ్వేల్ ప్రెస్ క్లబ్ 25 ఏళ్ల వేడుక సందర్భంగా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 'జర్నలిస్టులు-విలువలు-పౌర సమాజం పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకే-47 తుపాకీ కాలిస్తే చావడం లేదా చంపడం మాత్రమే జరుగుతుందని, ఒక ప్రశ్న కోట్లాది మందిని ఆలోచింపజేస్తుందని తెలిపారు. చచ్చిపోవడానికి సిద్ధమైన వాడు సైనికుడైతే.. పౌర సమాజ సైనికుడు జర్నలిస్టు అని అన్నారు. సమాచార కమిషనర్‌గా 25వేల ప్రశ్నలకు జవాబులు ఇచ్చానని, జర్నలిస్టుగా ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా వార్తలు రాశానని గుర్తు చేశారు. తెలంగాణ కోసం 75 ఏళ్ల పోరాటం ఫలించడంలో తన పాత్ర కూడా ఉందని, రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్-3ని కేంద్ర ప్రభుత్వానికి గుర్తు చేసింది తానేనని చెప్పారు. ఫస్ట్ ఎస్టేట్, రెండో ఎస్టేట్ కలిపి మూడో ఎస్టేట్ ద్వారా ప్రపంచాన్ని నడుపుతున్నారని విమర్శించారు. 4వ ఎస్టేట్ పునాదులు కదులుతున్న సందర్భంలో ఐదో స్తంభం అయిన సమాజం నాలుగో స్తంభం జర్నలిజాన్ని నిలబెట్టాలని అన్నారు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ గజ్వేల్ ప్రెస్ క్లబ్ అనేక మంది అభాగ్యులకు అండగా నిలిచిందని, 25 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ప్రజల గొంతుకగా నిలిచిందన్నారు. ప్రజల కోసం పనిచేసే జర్నలిస్టులను ప్రజలే ఆదరిస్తారని, ఈ నిజం జగదేవ్‌పూర్ సదస్సుతో నిరూపితమైందన్నారు. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ విలువలతో కూడింది కాబట్టే 25 ఏళ్ల వేడుకలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, ఎంపీడీవో రాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎంపీపీ బాలేషం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్



సిద్దిపేట ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం

బడిబాట ప్రారంభం

సిద్దిపేట కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం జిల్లాలో శుక్రవారం ప్రారంభమైంది. సిద్దిపేట ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హనుమాన్‌నగర్‌లో ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత గుణాత్మక విద్య అందించబడుతుందని తల్లిదండ్రులకు తెలియజేశారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీ.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు, నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధన చేపడుతున్నారని, ఎఫ్ఐబీ ద్వారా డిజిటల్ తరగతులు, ఎన్సిసి, క్రీడారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం సిద్దిపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాల ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలనే గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ వార్డులోని తల్లిదండ్రులు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ రాజాసింగ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ సందడి

త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగకు జిల్లాలో ముస్లింలు సిద్ధమవుతున్నారు. ఈద్ అల్ అదాను పురస్కరించుకుని శనివారం ఉదయం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలను చేయనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం పేద ముస్లింలకు ఖుర్బానీ అందజేస్తారు. ఇందు కోసం గొర్రె పొట్టేళ్ల కొనుగోలు సందడి కనిపించింది. శుక్రవారం పట్టణంలోని విక్టరీ చౌరస్తా, గద్దబొమ్మ సర్కిల్, మార్కెట్ చౌరస్తాలో గొర్రెలను అమ్మకం చేపట్టారు. ఒక్కొక్క పొట్టేలు రూ.8, నుంచి రూ.30 వేల వరకు ధర పలికాయి.

\- సిద్దిపేట కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి)





వెల్దుర్తిలో దొంగల బీభత్సం

తొమ్మిది బోరుబావుల వద్ద కేబుల్ వైర్లు చోరీ

వెల్దుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి కుడి చెరువు సమీపంలో, గంగమ్మ గుడి వద్ద ఉన్న పొలాల్లోని తొమ్మిది బోరుబావుల వద్ద కేబుల్ వైర్లను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం. వెల్దుర్తికి చెందిన అంగడిపేట అంజాగౌడ్, రమేష్ గౌడ్, మల్క క్రిష్ణ, గుంటుకు యాదగిరి, జెగ్గ నరేందర్‌గౌడ్, గంగమ్మ ఆలయానికి సంబంధించిన వ్యవసాయ పొలాల వద్ద ఉన్న మోటార్ల నుంచి విద్యుత్ స్టార్టర్ వరకు గల కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఈ కేబుల్ వైర్ల విలువ సుమారు రూ. లక్షకు పైగా ఉంటుందని, చోరీకి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



'భేటీ బచావో-భేటీ పడావో'పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంగ్టి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా మహిళా సాధికార కేంద్రం ప్రత్యేకాధికారి నర్సింహులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కంగ్టి అంగన్‌వాడీ సెంటర్-3లో భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధమన్నారు. బాలికల హక్కుల గురించి, బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, అనిత, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

సదాశివపేట, జూన్ 6 : (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో శుక్రవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు, రైలు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కొండాపూర్ మండలం సైదాపూర్ తాండాకు చెందిన కుర్ర సాయికిరణ్ (23) అతని పెద్దమ్మ సునితా బాయ్, ఆమె కొడుకు అభిషేక్ (13) శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో బయలుదేరి సదాశివపేట మండలం నందికంది గ్రామశివారులోని ఓ మామిడి పండ్ల దుకాణం (హోల్‌సేల్) వద్ద మామిడికాయలు కొనుగోలు చేశారు. పండ్లను విక్రయించేందుకు సునితాభాయ్‌ని సదాశివపేట పట్టణంలో వదిలిపెట్టి సాయికిరణ్, అభిషేక్‌లు స్వగ్రామం సైదాపూర్ తండాకు ఆటోలో తిరుగుప్రయాణమయ్యారు. వికారాబాద్ రోడ్డు మార్గంలో సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న ఓ లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న సాయికిరణ్, ఆటోలో కూర్చున్న అభిషేక్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు సాయికిరణ్ స్థానిక ఎంఆర్ఎఫ్ టైర్ల పరిశ్రమలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఒకే గ్రామంలో ఇద్దరు చనిపోవడంతో సైదాపూర్ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.


సదాశివపేట : ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రైలు ఢీకొని యువకుడు...

మనోహరాబాద్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ అడవిలో వేటకు వెళ్లిన వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం మనోహరాబాద్ మండల పరిధిలో చోటు చేసుకుంది. శివ్వంపేట్ మండలం గోమారం గ్రామానికి చెందిన ఎరుకల సముద్రాల కృష్ణ గురువారం రాత్రి అడవి పందుల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి మనోహరాబాద్ రైల్వేస్టేషన్ శివారులోని రైల్వేపట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని యువకుడు అక్కడిక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి రైల్వే హెడ్ కానిస్టేబుల్ హనుమాగౌడ్ తెలిపారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు కంపెనీ సూపర్‌వైజర్ మృతిచెందాడు. మాసాయిపేట మండలం కొప్పులపల్లికి చెందిన మల్ల నాగరాజు (33) మనోహరాబాద్ శివారులోని సూపర్ సీడ్స్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం కంపెనీలో విధులు ముగించకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. తూప్రాన్ పట్టణ శివారులో పాత హైవే రోడ్డుపై ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నాగరాజు

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

తప్పిన ప్రమాదం

రామచంద్రాపురం టౌన్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి) రామచంద్రాపురం అశోక్‌నగర్‌లోని పిస్తాహౌస్‌లోని కిచెన్ విభాగంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది త్వరితగతిన స్పందించి మంటలను అదుపు చేశారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని నిర్వాహకులు చెప్పారు.

అనారోగ్య సమస్యలతో
ఇద్దరు ఆత్మహత్య


మధు(ఫైల్)

వెల్దుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... వెల్దుర్తికి చెందిన జువ్వ మధు(62) కొన్నేళ్లుగా అధిక బరువు, బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి మద్యం మత్తులో విషం తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని వృద్ధుడు


గోపయ్య మృతదేహం

రాయపోల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం అనాజీపూర్‌లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అనాజీపూర్ గ్రామానికి చెందిన మన్నె గోపయ్య(70) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం ఆశిరెడ్డి కుంట వెనకాల ఉన్న చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకొని మృతి చెందినట్లు గుర్తించిన రైతులు గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు అతన్ని మన్నె గోపయ్యగా గుర్తించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధడుతూ మనస్తాపానికి గురైన గోపయ్య ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని కొడుకు సత్తయ్య తెలిపాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలింత ఆత్మహత్యాయత్నం

జోగిపేట రూరల్, జూన్6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ బాలింత శుక్రవారం అందోల్ పెద్దచెరువులోకి దిగి ఆత్మహత్యకు యత్నించింది. మహిళ నీటిలోకి దిగడాన్ని గమనించిన స్థానికులు ఆమెను రక్షించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం బాధితురాలిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.






1.స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, పొన్నం, కలెక్టర్ మనుచౌదరి 2.సభకు హాజరైన యువతులు 3. మేకల బండితో వస్తున్న యువకులు 4.మామిడి పండ్లను పరిశీలిస్తున్న సందర్శకులు

రైతు మహోత్సవం

హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు మహోత్సవం శుక్రవారం అట్టహాసంగా షురూ అయ్యింది. పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లు, అధునాతన యంత్రాల ప్రదర్శన నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ స్టాళ్లను పరిశీలించారు. మేకలతో ఏర్పాటు చేసిన బండి ఆకట్టుకుంది. రైతులు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదర్కొన్నారు.





యంత్రాల ప్రదర్శన



రైతు మహోత్సవానికి హాజరైన అన్నదాతలు, నాయకులు





ఉక్కపోతకు తాళలేక



హైదరాబాద్‌లో కంట్రోలర్ జన్నుబాయ్, కండక్టర్ బస్వరాజును సన్మానించి అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

విధి నిర్వహణలో నిజాయితీ

● సన్మానించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సంగారెడ్డి అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిజాయితీ చాటిన ఆర్టీసీ సంగారెడ్డి డిపో కంట్రోలర్ జన్నుబాయ్, కండక్టర్ బస్వరాజులను ఆ సంస్థ ఎం.డీ.సజ్జనార్ అభినందించారు. ఈ నెల 4న బాన్సువాడ డిపో బస్సులో పిట్లంకు చెందిన ప్రయాణికుడు సిద్దులు జేబీఎస్‌లో బస్సు ఎక్కి సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో దిగి బ్యాగు బస్సులోనే మర్చిపోయారు. ప్రయాణికులు సిద్దులు ఈ విషయాన్ని డ్యూటీ కంట్రోలర్ జన్నుబాయ్‌కు సమాచారం అందించారు. కంట్రోలర్ వెంటనే స్పందించి జోగిపేట పాయింట్ కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న కండక్టర్ బస్వరాజ్ సాయంతో జోగిపేటలో ఆ బ్యాగును తీసుకుని సంబంధిత ప్రయాణికుడు సిద్దులుకు అందజేశారు. అయితే ఆ బ్యాగులో రెండున్నర లక్షల నగదు, ల్యాప్‌టాప్, ప్రొజెక్టర్ ఉన్నాయి. కాగా విధి నిర్వహణలో నిజాయితీ చూపిన సంగారెడ్డి డిపో కంట్రోలర్ జన్నుబాయ్, కండక్టర్ బస్వరాజులను ఆ సంస్థ ఎం.డీ.సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌కు పిలిపించి సన్మానించి అభినందించారు.

ప్లాస్టిక్ రహిత వివాహ విందు

● స్టీలు, ఆకు ప్లేట్లు, ఫైబర్ గ్లాసుల వినియోగం



నారాయణఖేడ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చిన్న పాటి శుభకార్యం జరిగినా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, అలంకరణ సామగ్రి వినియోగించడం పరిపాటిగా మారింది. కానీ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం మాద్వార్ తండాలో శుక్రవారం ప్లాస్టిక్ రహితంగా వివాహ వేడుకను జరిపించి ఆదర్శంగా నిలిచారు. మాద్వార్ తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్ సోదరుడు రమేష్ వివాహం లక్ష్మితో జరిగింది. ఈ వేడుకలో పర్యావరణ పరిరక్షణ కోసం ఎలాంటి ప్లాస్టిక్ సామాగ్రిని వినియోగించ లేదు. అదీకూడా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి స్టీలు, ఆకు ప్లేట్లు, నీరు తాగడానికి ఫైబర్ గ్లాసులను వాడారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ సర్పంచ్ రాజునాయక్‌ను అభినందించారు.

గణితం పరీక్షకు 43 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు పరీక్ష జరిగింది. నాల్గవ రోజు 105 మందికి 62 మంది హాజరుకాగా 43 మంది గైర్హాజరయ్యారు. 59.05 హాజరు శాతం నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

వేతనాలు చెల్లించాలంటూ ఆందోళన

రామాయంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెలనెలా వేతనాలు చెల్లించడం లేదని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రామాయంపేటలో సఫాయిలు ఆందోళన చేపట్టారు. విధులకు హాజరకాకుండా నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని ఎంతోకాలంగా మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా నెలవారీగా వేతనాలు చల్లించాలని, లేనియెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



రామాయంపేటలో ధర్నా చేస్తున్న కార్మికులు

బాలికలకు భోజనం..
ఇక రుచి, శుచిగా..

● వంట మనుషులు, పారిశుధ్య కార్మికులకు శిక్షణ
● ఆహార తయారీ, నాణ్యత, పరిశుభ్రతపై అవగాహన
● మెనూ ప్రకారం రుచికర వంటకాలపై తర్ఫీదు
● పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో ఇటీవల కాలంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. నాణ్యత లేని సరుకులతో వంటకాలు, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేయడం తదితర కారణాలతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. సాధారణంగా చాలా మంది వంట మహిళలకు పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం తయారీపై అవగాహన లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో బడి పిల్లలు ఆహారాన్ని తీసుకునేందుకు విముఖత చూపుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ పలు చర్యలకు ఉపక్రమించింది. కస్తూర్బా గాంధీ విద్యాలయాలతో పాటు యూఆర్ఎస్, టీఆర్ఈఐఎస్, గర్ల్స్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న వంట మనుషులు, పారిశుధ్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లాలోని అందోల్, కాశీపూర్ కేజీబీవీలో ఒక రోజు పాటు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. అందోల్ కేజీబీవీలో వంట మనుషులకు, కాశీపూర్ కేజీబీవీలో పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు.

మెనూ ప్రకారం ప్రత్యక్షంగా ఆహారం తయారీ

కేజీబీవీల్లో విద్యనభ్యసించే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన బాలికలకు నాణ్యతతో కూడిన ఆహారం, వారుండే విద్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడంపై పాఠశాల విద్యాశాఖ దృష్టి సారించింది. ఈ నెల 12 వ తేదీ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండటంతో వచ్చే విద్యార్థులకు మంచి భోజనం అందించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆహార తయారీలో తర్ఫీదు పొందేందుకు జిల్లా నుంచి ఇద్దరు వంట మనుషులు, ఒక టీచర్‌ను, అదే విధంగా పరిశుభ్రత కోసం ఇద్దరు పారిశుధ్య కార్మికులు(స్వీపర్లు), ఒక ఏఎన్ఎంను హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. వీరు జిల్లా స్థాయిలోని శుక్రవారం అన్ని కేజీబీవీ, ఇతర విద్యాలయాల వంట మనుషులు, పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఆహార తయారీపై ఇచ్చిన శిక్షణకు 90 మంది, పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన శిక్షణకు 45 మంది హాజరయ్యారు. శిక్షణలో భాగంగా మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం ఎలా తయారు చేయాలంటే ఎలాంటి పోపులు వేయాలి? వంటకు ఉపయోగించే ఆకుకూరలు, కూరగాయలు ఎలా శుభ్రం చేయాలి, తదితర అంశాలపై ప్రత్యక్షంగా వడ్డించి అవగాహన కల్పించారు. ఇలా ఉండగా జిల్లాలో 22 కేజీబీవీలుండగా, అందులో 5500 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఏదేమైనా విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంతో బాలికలకు ఇక నుంచి మరింత రుచికరంగా ఆహారం అందనుండడంతో పాటు పరిసరాలు పరిశుభ్రతకు పెద్దపీట వేసే అవకాశముందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



ఆహార తయారీకి కూరగాయలు కట్ చేస్తున్న వంట మనుషులు



తయారు చేసిన వంటకాలతో వంట మనుషులు, అధికారులు

పటాన్‌చెరు రైతులకు రైతు భరోసా ఏది?

రామచంద్రాపురం టౌన్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు రైతు భరోసా ఇవ్వడం లేదని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, జిన్నారం మండలాల్లోని రైతులకు రైతుభరోసా చెల్లింపులు జరగలేదని వివరించారు. గుమ్మడిదల మండలంలోని రైతులకు రూ.3.78కోట్లు వారిఖాతాల్లో జమచేశారని తెలిపారు. మిగిలిన మండలాల్లోని 22,103 మందికి రూ.15.11కోట్లు జమకావాల్సి ఉందని తెలిపారు. నిధులు విడుదల చేస్తామంటూ మంత్రి హామీ ఇచ్చారని ఆయన వివరించారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

● తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

వెల్దుర్తి, జూన్6(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని పంతులపల్లి గ్రామ సమీపంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌ను ఆయన పరిశీలించారు. అలాగే వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తప్పకుండా వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారుల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు సరైన పత్రాలు వెంట ఉండాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట వెల్దుర్తి ఎస్ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.



తనిఖీలను పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

షెడ్ల నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటు

● ఉపాధి హామీ నిధుల వినియోగం
● జాబ్ కార్డు కలిగిన చిన్న, సన్నకారు రైతులు అర్హులు
● సిద్దిపేట జిల్లాకు 457 షెడ్లు మంజూరు

సిద్దిపేట రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల, పౌల్ట్రీఫాంల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటునందిస్తున్నది. అర్హులైన పెంపకందారులకు మహత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న సన్న, చిన్నకారు రైతులను అర్హులుగా గుర్తిస్తున్నది. 2024-25 సంవత్సరానికి సంబంధించి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 217 పశువుల షెడ్లు, 9 మేకల, గొర్రెల షెడ్లు, 5 పౌల్ట్రీ ఫాంలు నిర్మించగా, 2025-26కు సంబంధించి 457 షెడ్లు మంజూరయ్యాయి.


ఏ షెడ్డుకు ఎంతంటే..

పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.85 వేలు, గొర్రెలు, మేకల కోసం షెడ్డుకు రూ.లక్ష, పౌల్ట్రీ ఫాంకు రూ.3 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. అర్హులు ముందుగా పశు సంవర్థక శాఖ అధికారి నుంచి పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. అనంతరం పెంపకందారులకు భూమి పట్టా పాస్ పుస్తకం లేదా ధ్రువీకరణ పత్రంతో ఎంపీడీవో లేదా ఉపాధిహామీ కార్యాలయంలో షెడ్డు నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు వాటిని పరిశీలించిన అనంతరం నిధులను మంజూరు చేస్తారు. 2025-26 సంవత్సరానికి సిద్దిపేట జిల్లాకు మంజురైన షెడ్లలో ఇప్పటికే 140 వరకు పూర్తయ్యాయి. అదేవిధంగా గొర్రెలు, మేకల షెడ్లు 27, పౌల్ట్రీ ఫాంలు 10 నిర్మాణంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. షెడ్ల నిర్మాణంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పెంపకందారులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే షెడ్ల బిల్లులు చెల్లింపుల్లో కొంత మేర ఆలస్యమవుతున్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. త్వరగా బిల్లులు అందేలా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.



ఉపాధి హామీ పథకంలో నిర్మించిన పశువుల షెడ్డు

సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తు చేసుకున్నవారి ధ్రువపత్రాలను పరిశీలించి సిబ్బంది వెళ్లి షెడ్డు నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్నారు. నిర్మాణం పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లిస్తున్నాం. ఇప్పటికే పూర్తయిన షెడ్లకు త్వరలో బిల్లులు రానున్నాయి. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-జయదేవ్ ఆర్యా, డీఆర్‌డీవో, సిద్దిపేట

న్యూస్ బాక్స్

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు..

బెజ్జంకి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) :కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామస్థాయిలో ప్రతి ఇంటికి తెలిసేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే ఆపరేషన్ సిందూర్ విజయవంతం పై వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్

చేర్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ కృషి చేశారని అధికారంలోకి వచ్చిన రెండు పర్యాయాలు 10 లక్షల కోట్లు నిధులు ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్ తెలిపారు. శుక్రవారం చేర్యాల పట్టణంలో పట్టణ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అధ్యక్షతన ప్రధాని 11 సంవత్సరాల పాలనలో భాగంగా భారత్ అమృత్ కాలం సేవా సంపద, అభివృద్ధి పనులపై కార్యశాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాబోయే కాలంలో తెలంగాణకు పెద్దపీట వేస్తుందన్నారు. మోదీ నాయకత్వం దేశానికే గర్వకారణమన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ఉమారాణి, పట్టణ కార్యదర్శులు సిద్దులు, మనీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉచిత హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం

గజ్వేల్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారంగా జిల్లా యువజన క్రీడా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కొడకండ్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉచిత హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని మే 1 నుంచి జూన్ 6 వరకు నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం మాట్లాడుతూ విద్య, క్రీడలు మానసిక ఆరోగ్యము, ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవటానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు.

కొనసాగుతున్న భూభారతి సదస్సులు



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మార్వో సుజాత

కుకునూరుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నాలుగో రోజు భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. శుక్రవారం ముద్దాపూర్, రామచంద్రాపూర్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి త్వరలో వాటికి పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సుజాత, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరి, ఆర్‌ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం శుభ సూచకం

కుకునూరుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ వారాహి ప్రత్యాంగి సర్వేశ్వర స్వామి ఆలయ నిర్మాణం శుభ సూచకమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి శివారులోని రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేటు వెంచర్లలో శ్రీశ్రీ వారాహి ప్రత్యాంగి సర్వేశ్వర స్వామి దేవస్థానం ఆలయ నిర్మాణానికి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి ఆలయ నిర్మాణ మండలానికి ఇక్కడున్న ప్రజలందరికీ శుభ సూచకమని దేవాలయంలో ఆధ్యాత్మికత పెరగడంతో పాటు ప్రజలకు మనశ్శాంతి, భక్తి భావం పెరుగుతుందని ఆయన తెలిపారు.

సుద్దాల హనుమంతుకు నివాళి



హనుమంతు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది

గజ్వేల్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయంప్రతిపత్తి గజ్వేల్ తెలుగు విభాగం వారు శుక్రవారం సుద్దాల హనుమంతుడి చిత్రపటానికి నివాళులర్పించారు.

భూ భారతి సదస్సుల్లో రెవెన్యూ అధికారులు

● కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాల జారీ ఆలస్యం



దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం

దౌల్తాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన భూభారతి చట్టం ఈ నెల 3 నుంచి గ్రామాలలో ప్రారంభమైన భూ భారతి సదస్సులు ఈ నెల 20 వరకు జరగబోతున్నాయి. గ్రామాలలో జరుగుతున్న భూ భారతి సదస్సులల్లో రెవెన్యూ అధికార యంత్రాంగం మొత్తం బీజీ అయ్యారు. నూతన రేషన్ కార్డుల కోసం ప్రజలు, విద్యార్థులు పైచదువుల కోసం కుల, ఆదాయ, నివాస ధృవ పత్రాల కోసం మీసేవలో దరఖాస్తులు చేసుకున్నారు. హాస్టల్లో, 10 వతరగతి, ఇంటర్‌లో పాసైన విద్యార్థులు, డిగ్రీలో ఇతర పై చదువుల్లో జాయినింగ్ కావాలంటే కుల, ఆదాయ, నివాసం తప్పనిసరి, కావాలసిందే. విద్యార్థులు కులం, ఆదాయ, నివాస ధ్రువ పత్రాల కోసం మీసేవల చుట్టూ, తహసీల్దార్ కార్యాలయ చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. కుల,ఆదాయ, నివాస ధ్రువ పత్రాలను అన్‌లైన్ చేయడానికి తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ భూ భారతి సదస్సుల్లో పాల్గొనడంతో, వందల కొద్ది ధ్రువ పత్రాలు అన్‌లైన్ జరగక పెండింగ్‌లో ఉన్నాయి. దౌల్తాబాద్ తహసీల్దార్ చంద్ర శేఖర్‌రావును వివరణ కొరగా మాకు రెవెన్యూ సిబ్బంది అరకొరగా ఉన్నారని అందరం భూ భారతి సదస్సుల్లో ఉన్నామని కంప్యూటర్ ఆపరేటర్ భూ భారతి సదస్సుల్లో అప్పటికప్పుడు అన్‌లైన్ చేసేవి ఉంటాయని అందుకని కంప్యూటర్ ఆపరేటర్ మాతోసే భూ భారతి రెవెన్యూ సదస్సులలో పాల్గొనడంతో కుల, ఆదాయ,నివాస ధ్రువ పత్రాలు అన్‌లైన్ కోరుతున్నారు.

విద్యార్థిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే



వైష్ణవిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో రాష్ట్ర స్థాయిలో మెరిట్ మార్కులు సాధించిన హుస్నాబాద్ పట్టణంలోని ఆరపల్లికి చెందిన రాదారపు వైష్ణవిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ సన్మానించారు. వైష్ణవి 470/468 మార్కులు సాధించింది. .

ఎస్సీ హాస్టళ్లలో అడ్మిషన్లు ప్రారంభం

మద్దూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట, మద్దూరు మండల కేంద్రాల్లోని ఎస్సీ హాస్టళ్లల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వార్డెన్లు సుధాకర్, ముత్యాల చక్రధర్ తెలిపారు. అడ్మిషన్ కొరకు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లతో పాటు బోనఫైడ్ సర్టిఫికెట్, మూడు పాస్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సుపరిపాలనకు 11 ఏళ్లు



వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

వర్గల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వర్గల్ మండల కేంద్రంలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ సూచనల మేరకు వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మాకే నామ్ పే ఎక్ పెడ్ నిర్వహించారు. తల్లి పేరుపై ప్రతి ఒక్కరు మొక్కలు నాటారన్నారు.

కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల కోసం..

● సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

చిన్నకోడూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) :కేంద్ర ప్రభుత్వం దేశంలో పేద ప్రజల కోసం కాకుండా పెట్టుబడిదారుల కోసం పని చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆరోపించారు. శుక్రవారం చిన్నకోడూరులో నిర్వహించిన సీపీఐ మూడవ మండల మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల భవిష్యత్ అంధకారంలోకి నెట్టి వేయబడిందని ఆరోపించారు. దేశంలో కార్మికుల హక్కులు కాలరాయ బడుతున్నాయని, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, 04 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక లోకాన్ని అభద్రతాభావంలోకి నెట్టివేశారని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం నిత్యవసర ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపి పేద ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. పీడిత వర్గాల హక్కుల కోసం అడవి బాట పట్టి తమ ప్రాణాలను సైతం ప్రజల కోసం అంకితం చేస్తున్న మావోయిస్టుల విషయంలో చర్చలకు పిలవకపోవడం సిగ్గు చేటని, వెంటనే మావోయిస్టులతో చర్చలు జరిపి ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా వామపక్ష పార్టీల పిలుపు మేరకు ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని చేసే నిరసన ప్రదర్శనలలో సీపీఐ పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలతో పాటు ఇందిర ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హునికి రుణం మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

ప్రధాని సుపరిపాలనపై మండల కార్యశాల

కొమురవెల్లి, జూన్6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అయినపూర్ గ్రామంలో మండల అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప అధ్యక్షతన శుక్రవారం భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాల సుపరిపాలన-సంకల్పం సాకారం మండల కార్యశాలకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఆరుట్ల దశమంత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మోదీ పాలనలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందనీ 11 సంవత్సరాల పాలనలో దాదాపు 17 కోట్ల మంది పేదలను దారిద్ర్యరేఖకు ఎగువకు తీసుకువచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై ధ్వంసం చేసి దేశ ప్రజల మనస్సును గెలుచుకున్న గొప్ప నాయకుడు మోదీ అన్నారు. దేశ రక్షణ విషయంలో ప్రధాని రాజీలేని నిర్ణయాలు తీసుకొని దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ అసెంబ్లీ కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి,గ్రామశాఖ బూత్ అధ్యక్షుడు ప్రకాశ్, మండల నాయకుడు బి.కృష్ణారెడ్డి, తలారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కావలెను

(5వ పేజీ తరువాయి)

కౌన్సిల్, కమిషనర్ సూచన మేరకు పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు కృషి చేశారు.

డిప్యూటేషన్‌పై వచ్చిన వారు సొంత శాఖలకు

సిద్దిపేట మున్సిపల్‌కు పలు శాఖల నుంచి వచ్చిన ఉద్యోగులు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించగా, ఇటీవల ప్రభుత్వం చేపట్టిన శాఖల బదిలీల్లో భాగంగా ఎవరికి వారు తమ సొంత శాఖలకు తిరిగి వెళ్లిపోయారు. నలుగురిలో ముగ్గురు సొంత గూటికి వెళ్లగా, మరొకరు ప్రమోషన్ పొంది ఇతర ప్రాంతానికి కమిషనర్ హోదాలో బదిలీ అయ్యారు. దీంతో సిద్దిపేట మున్సిపల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల కొరత ఏర్పడింది. ఈ మేరకు శానిటరీ సిబ్బందికి ప్రతిరోజు ఉదయం పట్టణ ప్రగతిపై ఉదయం హాజరు తీసుకోవడంతో పాటు పట్టణ శుభ్రత, సిబ్బంది హాజరు పట్టిక, పలు మురికి కాలువలో పేరుకుపోయిన సీల్ట్ తదితర వాటిని పర్యవేక్షించి, పలు సమస్యలను పరిష్కరించేవారు. ఐదు నెలలుగా దాదాపు ఇలాంటి పరిస్థితి ఏమి లేకపోవడంతో సిబ్బంది కూడా ఉత్సాహంగా పనిచేయలేకపోతున్నారు. ఇటీవల ఓ దివ్యాంగ ఉద్యోగి సిద్దిపేట మున్సిపల్‌లో ఇతర ప్రాంతం నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు. ఈ మేరకు వచ్చిన కొద్ది రోజుల్లోనే ఆ ఉద్యోగి కూడా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో మళ్లీ షరా మామూలే అన్నట్లుగా పోస్టు ఖాళీగా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా రెగ్యులర్ అధికారిని నియమించాలని మున్సిపల్ శాఖ, సీడీఎంఏను పట్టణ ప్రజలతో పాటు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

● నీలం మధు ముదిరాజ్

అక్కన్నపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెంట్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలం చౌటపల్లిలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఇందులో ఆలయ చైర్మన్ గంగాధరి రాజయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు ఉన్నారు.

హుస్నాబాద్ కిసాన్ మేళాకు బస్సు సౌకర్యం..

మద్దూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లోని ఏఎంసీలో నేడు ఏర్పాటు చేసిన కిసాన్ మేళాకు తరలివెళ్లేందుకు రైతుల సౌకర్యార్థం బస్సు సౌకర్యాల్ని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం మద్దూరు మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ తెలిపారు. ధూళిమిట్ట మండలంలోని ధూళిమిట్ట, కొండాపూర్, బైరాన్‌పల్లి, మద్దూరు మండలంలోని మద్దూరు, లద్నూరు రైతు వేదికల ఆధ్వర్యంలో ఈ బస్సు సౌకర్యాల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన వ్యవసాయ పనిముట్లు, నూతన విత్తనాలు, డ్రోన్స్ టెక్నాలజీతో పాటు పలు అంశాలపై ప్రదర్శనలుంటాయన్నారు. రైతలకు ఎంతో ప్రయోజనాల్ని చేకూర్చుతాయని తెలిపారు. రైతులు తప్పని సరిగా ఆయా రైతు వేదికల వద్ద నుంచి తరలివెళ్లే బస్సులలో హుస్నాబాద్‌కు రావాలని సూచించారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం

గజ్వేల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కాయకల్ప ఎక్సటర్నల్ అసెస్మెంట్‌ను శుక్రవారం బృందం సభ్యులు డాక్టర్ అమీర్‌సింగ్, సాకారం, రేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులకు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ స్వాగతం పలికారు. ఆసుపత్రిలోని ఆయా వార్డులు ఆపరేషన్ థియేటర్, లేబర్‌రూమ్, స్వచ్ఛత నిర్వహణ, వేస్ట్ మేనేజ్మెంట్ తదితర అంశాలలో దవాఖానాను క్షుణ్ణంగా పరిశీలించి గ్రేడింగ్ నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఒకేసారి బయోమెట్రిక్ ..

చేర్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యానికి ఒకేసారి బయోమెట్రిక్ తీసుకునేలా ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఎం మండల కార్యదర్శి బండకింద అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని శబాష్‌గూడెంలో ఏర్పాటు చేసిన గ్రామశాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ముందస్తు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఒకేసారి మూడుమాసాలకు సంబంధించి రేషన్ ఇవ్వడంతో పలుమార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తోందని దీంతో లబ్ధిదారులు ఇబ్బందుల పడాల్సి వస్తున్నట్లు తెలిపారు. వెంటనే లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పాత్ర మరువలేనిది

గజ్వేల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డును తీసుకోవడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర మరువలేనిదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు

దౌల్తాబాద్,జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాలలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్య బోధన, పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని ఎంఈవో గజ్జల కనకరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని దొమ్మాట, జడ్పీ పాఠశాల,దౌల్తాబాద్ జడ్పీ బాలుర పాఠశాల, గాజులపల్లి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని గ్రామాల్లో వీధుల గుండా, ఇంటింటికి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మైక్‌ల ద్వారా బడి బాటపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో గజ్జెల కనకరాజు, దొమ్మాట జడ్పీ పాఠశాల హెచ్‌ఎం బాసిత్, ఉపాధ్యాయులు కలిసి గ్రామ సభ ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లి దండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి,సర్దార్‌హుస్సేన్,నిర్మల,ఉపాధ్యాయులు త్యాగరాజు, యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు బిక్షపతి,అంసకేతన్,తదితరరలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణాల్లో జాప్యం

మద్దూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ధూళిమిట్ట మండలంలోని హన్మతండా, మద్దూరు మండలంలోని వంగపల్లి గ్రామాలకు 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరై నాలుగేళ్లు దాటినా పనులు ముందుకు సాగింది లేదు. విద్యుత్ వినియోగం పెరగడంతో అధికలోడుతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ఉండేందుకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే క్రమంలో ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.1 కోటిపైగానే నిధులు వెచ్చించి నిర్మించేందుకు గత ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేసింది. స్థల సేకరణలో అధికారులు ప్రజాప్రతినిధులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. హన్మతండాలో రైతు ఇస్లావత్ కీమాతన సొంత 20 గుంటల స్థలాన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అందించేందుకు ముందుకు వచ్చాడు. ఈ క్రమంలోనే తన కుమారునికి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పర్మనెంట్ ఆపరేటర్ ఉద్యోగావకాశం ఇవ్వాలని షరతు పెట్టాడు.

బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే



మొక్కు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం పెద్దారెపల్లిలో జరుగుతున్న బొడ్రాయి ఉత్సవాల్లో శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యతో కలిసి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా ఎదగడానికే ఉల్లాస్ కార్యక్రమం



ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్

కుకునూరుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా ఎదగడానికే ఉల్లాస్ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిసుందని వయోజన విద్యా ప్రాజెక్టు ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామంలో జరుగుతున్న బడి బాట కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించి అనంతరం ఉన్నత ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని గురించి వివరించారు. డీఆర్‌డీఏ, మెప్మా, సెర్ప్ శాఖ సహకారంతో మహిళలందరికీ చదువు నేర్పించడమే ధ్యేయమన్నారు. ఉల్లాస్ యాప్‌లో పేర్లు నమోదు చేసి అనంతరం వారికి వలంటీర్ల ద్వారా బోధన చేయడం జరుగుతుందన్నారు. 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులకు చదువు అందించే సంపూర్ణ అక్షరాస్యతగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. సమాజంలో అభివృద్ధికి పునాది అయిన అక్షరాస్యత సంఖ్యా శాస్త్రంలపై దృష్టి సాధించాలన్నారు. ప్రభుత్వం ఏర్పరిచిన కార్యక్రమాన్ని అందరూ చదువుకునేలా కృషి చేయాలన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పదో తరగతి వరకే చదివి నిలిపివేసిన వారు ఆపై చదువులు నిలిపివేసిన వారు ఓపెన్ స్టడీ సిస్టంలో పూర్తి చేయవచ్చని ఇలాంటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి దీవెనతో

● త్వరలో ఇర్కోడ్ లిఫ్ట్ ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

ఉత్కంఠభరితంగా జరిగాయని, ఎన్నికల వరకే పోటీ ఉండాలని, తర్వాత పద్మశాలి సమాజం బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు కాముని రాజేశం, ప్రధాన కార్యదర్శి బాలరాజు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు పర్యటన ఇలా..

సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడు గ్రామంలో మహంకాళీ అమ్మవారి, చింతమడక పట్టాభి రామాచంద్ర స్వామి ఆలయం, పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలోని మహంకాళీ అమ్మవారి, సిద్దిపేట అర్బన్ మండలంలోని గోనెపల్లిలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామంచ గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ పునర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. పెద్దకోడూరు శివారులో పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు గ్రామంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఒగ్గు మురళి తల్లి ఇటీవలే మృతిచెందగా వారి కుటుంబాన్ని, నారాయణరావుపేట మండలంలోని బంజేరుపల్లిలో మాజీ సర్పంచ్ శంకర్ తల్లి మృతిచెందగా వారిని పరామర్శించారు. నంగునూరు మండలం జేపీ తండా మధిర పిట్టల గుడిసెల వాసులకు మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ సహకారంతో తన తల్లి తండ్రి మహమ్మద్ ఖాను, మహమ్మద్ హుస్సేన్ జ్ఞాపకార్థం రూ.2 లక్షల విలువ చేసే వంట సామగ్రిని పంపిణీ చేసే కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ రైల్వే బ్రిడ్జి వద్ద గజ్వేల్ ట్రాఫిక్ ఏఎస్సై జగదీశ్వర్, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వాహనదారులతో ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి



రాయపోల్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

మద్దూరు/బెజ్జంకి/కుకునూరుపలి/రాయపోల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో పలు చోట్ల బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు బారంగా మారుతుంది. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యా బోధన జరుగుతుందని రాయపోల్ ఎంఈవో సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన రాంసాగర్, రాయపోల్ గ్రామ సభలో పాల్గొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతుంది. ప్రభుత్వ పాఠశాలలో అన్ని ఉచితంగా అందుతాయని కుకునూరుపల్లి మండల ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. ప్రజలు ప్రభుత్వ ఉచిత విద్యను కూడా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలను కాదని ప్రైవేటుకు వెళితే తల్లిదండ్రులకు బారంగా మారుతుందని ఆయన అన్నారు. ఉపాధ్యాయుల బోధనలో ఏమైనా తప్పిదాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఖచ్చితంగా వాటిని పరిష్కరిస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే కార్పోరేట్‌కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని బెజ్జంకి జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, ప్రాథమిక పాఠశాలఉపాధ్యాయులు అన్నారు.